సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



శుభ ఘడియలు వచ్చేశాయ్

పెళ్లి ముహూర్తాలు వచ్చేశాయి. ఈ నెల 13 నుంచి ముహూర్తాలు ఉన్నాయి.

- 8లో



పోలీస్‌స్టేషన్ ముందే..

టెక్కలిలో పోలీస్‌స్టేషన్ ముందే టీచర్లు వాగ్వాదానికి దిగారు. పోలీసులు విచారణ చేశారు.

- 8లో

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం పుష్య బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉదయం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివేటి మండపంలో వేంచేసింప జేశారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని నిర్వహించారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కవిటి: జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయను కలిసిన జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు

అరసవల్లి: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా డిప్యూటీ కలెక్టర్ హోదా అధికారి డి.వెంకటేశ్వరరావు మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. విజయనగరం జిల్లా బొబ్బిలి భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను జిల్లా జెడ్పీ సీఈఓగా నియమిస్తూ బది లీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కీలక విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను మర్యాదపూర్వకంగా ఆమె స్వగృహంలో కలిశారు. రెగ్యులర్ సీఈఓ విధుల్లో చేరడంతో ఆర్.వెంకట్‌రామన్ ఇకపై జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగానే బాధ్యతలను కొనసాగించనున్నారు.

11న జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 11వ తేదీన జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు జరగనున్నాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్ కుమార్ తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన స్త్రీలు, పురుషులు ప్రాతినిధ్యం వహించవచ్చని అన్నారు. ఈ పోటీల్లో 35, 40, 45, 50, 55, 60, 65, 70, 75 వయో విభాగాల్లో పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఇలా వేర్వేరు కేటగిరీల్లో ఎంపికలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన వారిని ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన ఏర్పాట్లు కల్పించనున్నట్టు వెల్లడించారు. ఈ ఎంపికల్లో పాల్గొనే ఆసక్తి కలిగిన 35 ఏళ్ల పైబడిన క్రీడాకారులు జిల్లా బ్యాడ్మింటన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు (94402 55255), సహాయ కార్యదర్శి లాభాల రవి (94411 22864)లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సాగర్, అశోక్ సూచించారు. డబుల్స్/మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరికి రూ.500, సింగిల్స్ కేటగిరికి రూ.300 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

నకిలీ అధికారుల హల్‌చల్



నకిలీ అధికారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ గోవిందరావు

రణస్థలం: జేఆర్‌పురంలోని వెంకటేశ్వర ప్రైవేటు స్కూల్‌లో ఇద్దరు నకిలీ అధికారులు హల్‌చల్ చేశారు. జేఆర్ పురం పోలీసులు, స్కూల్ యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. తాము ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ అధికారులమంటూ ఎ.సంతోష్, సుందరం అనే ఇద్దరు వ్యక్తులు మంగళవారం స్కూల్‌కు వచ్చారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు బాగోలేవని, స్కూల్ బస్సులు సరైన కండీషన్‌లో లేవని, మీకు ఫైన్ వేస్తామని బెదిరించారు. స్కూల్ కరస్పాండెంట్ డి.కిశోర్ కుమార్ వచ్చి ఐడీ కార్డులు చూపించమంటే వారు చూపలేదు. దీంతో ఆయనకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి ఆ ఇద్దరు వ్యక్తులను జేఆర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు వారిద్దరినీ విచారించారు. వయసురీత్యా పెద్దవారు కావడంతో మందలించి పంపించేశారు. వీరిద్దరూ గతంలోనూ ఇలాగే ప్రైవేటు స్కూళ్లకు వెళ్లి వసూళ్లకు పాల్పడినట్లు చెబుతున్నారు.

ఆమదాలవలసలో కార్డన్ సెర్చ్

ఆమదాలవలస: దస్త్రాలు లేని వాహనాలు వినియోగిస్తే చర్యలు తప్పవని ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్ హెచ్చరించారు. ఆమదాలవలస సర్కిల్ పరిధి సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం గ్రామంలో మంగళవారం ఉదయం 4 నుంచి 7గంటల వరకు కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో దస్త్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు ఆమదాలవలస సీఐ విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి, పొందూరు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జనసున్నాయేనా..?

- జనసేన నాయకుల్లో గుబులు
- జిల్లాలో అసలు పోటీ చేసే అవకాశం లేదనే సంకేతాలతో ఆందోళన
- ప్రస్తుతానికైతే పాతపట్నం, పలాసపై చర్చ
- అధినేత నుంచి రాని కనీస సమాచారం
- పోటీ చేయకపోయినా టీడీపీ జెండా మోయాలంటూ పవన్ ఆదేశం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జనసేనకు పొత్తులో ఉత్తి చేతులే మిగులుతున్నాయా..? పోటీ చేయకపోయినా భుజాన పచ్చ జెండాలు మోయాల్సిందేనా..? పొత్తులో నష్టం జరిగినా భరించాల్సిందేనని పవన్ చెప్పిన మాట వాస్తవమేనా..? జిల్లాలో పరిస్థితులు చూస్తుంటే అన్నింటికీ అవుననే సమాధానమే వినిపిస్తోంది. జిల్లాలో ఒక్క చోటైనా పోటీ చేస్తామా.. అని జనసేన కార్యకర్తలు అడిగితే సమాధానం చెప్పే పరిస్థితుల్లో ఆ పార్టీ అధిష్టానం లేదు. మరోవైపు టీడీపీ ఇస్తున్న లీకులు, ఎల్లో మీడియాలో వస్తున్న కథనాలను చూసి మనకు ఈ సారి 'జీరో'నే అన్న నైరాశ్యంలోకి అంతా వెళ్లిపోతున్నారు.

మాకు పట్టుంది నమ్మండి..

జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో తమకు పోటీ చేసే సత్తా ఉందని జనసేన నాయకులు చెబుతున్నారు. వాటిలో కనీసం రెండు మూడు నియోజకవర్గాలైనా తమకు కేటాయించాలని అడుగుతున్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం ఉందని టీడీపీతో పోటీ పడుతున్నారు. అధిష్టానం కూడా ఆశల్లో ఊరేగిస్తూ చివరకు తుస్సుమనిపిస్తోంది. తప్పకుండా మనకు కొన్ని నియోజకవర్గాలు వస్తాయని, రోజుకొక నియోజకవర్గాన్ని తెరపైకి తీసుకురావడం, ఆ తర్వాత విస్మరించడం చేస్తోంది. మొదట ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాలు జనసేనకు వస్తాయని పార్టీలో చర్చించుకున్నారు. అధిష్టానం కూడా సూచన ప్రాయ సంకేతాలిచ్చిందని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొన్ని రోజుల్లోనే ఆ ప్రతిపాదన పక్కకు వెళ్లింది. తర్వాత పలాస, పాతపట్నం, ఇచ్ఛాపురం, ఆమదాలవలస నియోజకవర్గాలు తెరమీదకి వచ్చాయి. కానీ క్లారిటీ ఇవ్వలేదు సరికదా అసలు జిల్లాకు ఒక్క సీటు కూడా జనసేనకు కేటాయించడం లేదని టీడీపీ లీకులు ఇచ్చింది. అందుకు తగ్గట్టుగా ఎల్లోమీడియాలో కథనాలు వండి వార్చింది. అనుకున్నట్టుగానే ఆ నాలుగు నియోజకవర్గాల ప్రతిపాదిత కార్యాచరణ ముందుకు సాగలేదు. తాజాగా పాతపట్నం, పలాస నియోజక వర్గాలు తెరపైకి వచ్చాయి. ఈ రెండింటిలోనూ జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ నాయకులు నర్మగర్భంగా చెబుతున్నారు. ఆశావహులను పక్కన పెడితే కేడర్ మాత్రం మన జిల్లాలో జనసేన సీట్లు కేటాయించే అవకాశం లేదని, గెలిచే సామర్థ్యం లేనందున అధినాయకుడు పవన్ కళ్యాణ్ పెద్దగా జిల్లాపై దృష్టి సారించడం లేదని చెప్పుకొస్తున్నారు.

టీడీపీని మోయాల్సిందే

ఇప్పుడున్న పరిణామాలను చూస్తుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేనకు అవకాశం లేదని స్పష్టమవుతోంది. పొత్తులో భాగంగా జనసేనకు 25 సీట్లు కేటాయించేందుకు చంద్రబాబు అంగీకారం తెలిపారని, అందులో శ్రీకాకుళం నుంచి ఒక్కటి కూడా లేదని తెలుస్తోంది. ఈ జిల్లాలో ఇచ్చేందుకు చంద్రబాబు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇదే సందర్భంలో మనకు సీట్లు వచ్చినా, రాకపోయినా పొత్తులో భాగంగా టీడీపీ జెండాలు మోయాల్సిందేనని మరోవైపు పవన్ కల్యాణ్ నిర్మోహమాటంగానే నాయకులకు చెప్పేస్తున్నారు. ఎవరి బలమేంటో, ఏ పార్టీకి ఎంత పట్టు ఉందో తెలుసునని, తనకొక వ్యూహం ఉందని, తాను ఏ నిర్ణయం తీసుకుంటే ఆ విధంగా పనిచేయాలని ఆదేశిస్తున్నారు. దీంతో జనసేన నాయకులకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. పలాస, పాతపట్నంలో టీడీపీ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలున్నాయని, గ్యారెంటీగా ఓడిపోయే స్థానాలని, ఆ పరిస్థితుల్లో వారిని కాదని జనసేనకు ఇస్తే ఇవ్వవచ్చని లేదంటే జనసేనకు జిల్లాలో జీరోయే అన్న అభిప్రాయంలో జనసైనికులు ఉన్నారు. ఒకవేళ జనసేనకు ఒకటి రెండు వచ్చినా వాటిలో కూడా తొలి నుంచి పనిచేస్తున్న వారిని కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారినే పోటీలో పెడతారన్న వాదనలు కూడా నడుస్తున్నాయి. అదే జరిగితే ఐదేళ్లుగా పార్టీకోసం పనిచేసి, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకున్న తమను అధినాయకుడు నిండా ముంచినట్టే, తమ ఆశలపై నీళ్లు చల్లినట్టేనని వారంతా ఆందోళనతో ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రం కోసం భవనాల పరిశీలన



శివానీలో కౌంటింగ్ కేంద్రాల కోసం భవనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్, ఎస్పీ రాధిక, జాయింట్ కలెక్టర్ నవీన్ తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రం నిర్వహణకు సంబంధించి పలు భవనాలను కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ మంగళవారం పరిశీలించారు. చిలకపాలేంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు బ్లాక్‌లను పరిశీలించారు. 2014, 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా పది నియోజక వర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూమ్‌లు ఇక్కడే నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధికలతో కూడిన అధికారులు మొత్తం భవనాలు పరిశీలించి, ఏర్పాట్లపై సమీక్షించారు. ఇదే క్యాంపస్ ఆవరణలో ఉన్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం అద్దె క్యాంపస్‌ను కూడా పరిశీలించారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్‌పై కోర్టులో కేసు ఉన్నందున ఒక బ్లాక్ ఈవీఎంలతో ఉంది. పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఎనిమిది నియోజక వర్గాలకు సంబంధించి కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, డిపాజిట్ సెంటర్‌లు నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ బూత్‌ల ఏర్పాటు వంటి అంశాలకు సంబంధించి అధికారులతో చర్చించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిశీలించారు. ఇక్కడి భవనాలు పరిశీలించి, పూర్తిస్థాయిలో భవనాల వివరాలు నివేదిక కోరారు. వర్సిటీలో కౌంటింగ్ కేంద్రాలు సామర్థ్యంపై వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజనీతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సీహెచ్ గంగయ్య, ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బాలరాజు, ఎచ్చెర్ల తహసీల్దార్ వి.శ్యాంకుమార్, ఎచ్చెర్ల ఎస్‌ఐ చిరంజీవి, శివానీ కళాశాల యాజమాన్య ప్రతినిధులు దుప్పల వెంకటరావు, పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, శివానీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరునికి జలాభిషేకం

దక్షిణ కాశీగా ఖ్యాతినొందిన శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుడికి సోమవారం 108 బిందెల వంశధార నీటితో జలాభిషేకం చేశారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏక వార అబిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

– జలుమూరు:



పలాసలో గంజాయి తరలిస్తున్న మహిళలు అరెస్టు



పదికేజీల గంజాయితో పట్టుబడిన మహిళలతో పోలీసులు, అధికారులు

కాశీబుగ్గ: ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి పలాస మీదుగా గంజాయిని తరలిస్తున్న ముఠాను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ పారినాయుడు మంగళవారం సాయంత్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాస రైల్వే స్టేషన్ సమీపంలోని రామాలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలతో పాటు ఇద్దరు వ్యక్తులను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. క్రైమ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రెండు బ్యాగులు తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి బయటపడింది. ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రం తిరుచనాపల్లి వద్ద కేకల్లకుడి గ్రామానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లుగా ఎస్‌ఐ పారిపాయుడు తెలిపారు. పర్లాఖిమిడి సుభాష్‌నగర్‌కు చెందిన నాగ అప్పారావు, కేకల్లకుడికి చెందిన రాజారావ్‌పాల్వాకు కుదిరిన ఒప్పందం మేరకు ఈ రవాణా చేస్తున్నట్లు పోలీసు విచారణలు తేలింది. ఈ తనిఖీల్లో క్రైమ్ బ్రాంచ్ పోలీసులు శ్రీనివాసరావు, నీలకంఠం, కోదండరావు, డీటీ రాజేష్, వీఆర్‌ఓ ఖగేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కొత్త సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి'



గొర్రెల మంద చూస్తున్న చైర్మన్ రాపాక చిన్నారావు, సర్పంచ్ దేశయ్య

కాశీబుగ్గ: గొర్రెలు, మేకల కాపరులు కొత్త సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని షీప్ అండ్ గోట్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. పలాస మండలం మాకన్నపల్లి పంటపొలంలో ఉన్న గొర్రెల మందను ఉదయం ఐదుగంటలకు సందర్శించి గొర్రెల కాపరుల కష్టాలను స్వయంగా చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల కాపరుల సంక్షేమం కోసం ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఎండీ దామోదరనాయుడు దృష్టికి కొన్ని అంశాలు తీసుకుని వెళ్లామని అన్నారు. గొర్రెల కాపర్లకు యాభై ఏళ్లకు పింఛన్ అందించాలని కోరామన్నారు. మంచు, వర్షానికి రక్షణగా టెంట్, నెట్, అల్యూమినియం కొయ్యలు, షిఫ్టింగ్‌కు చిన్నబండి, గ్యాస్ స్టవ్, టార్చ్‌లైట్‌లు, రగ్గులు అన్నీ కలిపి ఒక కిట్‌గా అందించాలని ప్రతిపాదనలు పెట్టామన్నారు. క్షేత్ర పరిశీలనలో మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య, గొర్రెల కాపరులు ఉన్నారు.

ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటరు జాబితాలో చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జేసీ ఎం.నవీన్‌తో కలిసి ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. నోడల్ ఆఫీసర్లు ముందస్తు రోడ్ మ్యాప్ తయారు చేయాలని సూచించారు. ఫారం-6, ఫారం-8 దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాలని చెప్పారు. ఫిబ్రవరి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న డూప్లికేట్, మరణించిన, తదితర దరఖాస్తులను సవరించి పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైనింగ్ ఇచ్చే వారిని గుర్తించి ట్రైనింగ్ షెడ్యూల్ తయారు చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారీగా గతంలో ఎంతెంత పోలింగ్ శాతం జరిగిందో చూసి, ఏ పోలింగ్ కేంద్రాల వద్ద తక్కువ పోలింగ్ శాతం జరిగిందో అక్కడ పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిక్షణ, ఓటింగ్ పైన, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, బ్యాలెట్ పేపర్లు, తదితర కమిటీలపై ఆయన సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. మెటీరియల్ మేనేజ్‌మెంట్‌పై ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, స్వీప్, తదితర వాటిపై సమీక్షించారు. అంతకుముందు రీ సర్వేపై వివరాలను పరిశీలించి అందజేయాలని ఆదేశించారు.

సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి రామ్మోహనరావు, ఆర్డీఓలు డాక్టర్ భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, డీటీసీ చంద్ర శేఖర్ రెడ్డి, ఉప కలెక్టర్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిప్యూటీ సీఈఓ వెంకటరామన్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనూరాధ, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, డీఎస్పీ బాలరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, తహసీల్దార్లు, ఎలక్షన్ డిటీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కోర్సులపై ప్రత్యేక దృష్టి



సమీక్ష నిర్వహిస్తున్న వైస్ చాన్సలర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్వహిస్తున్న మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలో అధికారులతో యూజీసీ ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. పోస్టు గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో తప్పనిసరి ఆన్‌లైన్ కోర్సులు అమలు చేయాలని అన్నారు. అన్ని కోర్సులకు సంబంధించి లాగిన్ అవ్వాలని చెప్పారు. ఈ కోర్సులు చేయటం వల్ల విద్యార్థులకు క్రెడిట్స్ రావటంతో పాటు, నైపుణ్యాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఏటా జనవరి, జూలై నెలల్లో ఈ కోర్సులు ప్రారంభమవుతాయని, 8, 12, 16 వారాల టెర్మ్‌ల్లో ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణ ఉంటుందని చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు కనీసం ఒక్క కోర్సు, ఇంజినీరింగ్ విద్యార్థులు రెండు కోర్సులు చదివేలా ప్రిన్సిపాళ్లు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. సమీక్షలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్‌రావు, మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు ఇన్‌చార్జ్ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి: డీఈఓ



జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో డీఈఓ వెంకటేశ్వరరావు, విజయకుమారి, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాత (యాత్ర)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు మూఢ నమ్మకాలను విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని హయాతీనగరంలో ఉన్న ఎంజేపీఏపీబీజీడబ్ల్యూ గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు జి.జాహ్నవి, జి.కీర్తిప్రియలు మూఢనమ్మకాలకు ఎలా దూరంగా ఉండాలో తెలియజేస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థినులను గురుకులం ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, అధికారులు అభినందించారు. జేవీవీ రాష్ట్ర నాయకులు జి.మురళీధర్, జి.గిరిధర్ కళాజాత కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రూపొందించిన పలు పుస్తకాలను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జి.మురళీధర్, జి.గిరిధర్, కొత్తకోట అప్పారావు, ఎన్టీఆర్ఎంహెచ్ స్కూల్ సీహెచ్ దేవదత్తం, జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

సమ్మోహన గోపురం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ రాజగోపురం విద్యుత్ కాంతులతో మెరిసిపోయింది. ఈ నెల 16న సూర్యజయంతిని పురస్కరించుకుని ఆలయాన్ని ఇలా ప్రకాశవంతంగా అలంకరిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం అనివెట్టి మండపానికి ముందున్న ఈ పురాతన రాజగోపురానికి విద్యుత్ లైట్ల అలంకరణ పూర్తి చేశారు.

– అరసవల్లి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో జైళ్లశాఖ డీఐజీ



రవికిరణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కోస్తాంధ్రా జైళ్ల విభాగం డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జిల్లా జైళ్ల శాఖాధికారి ఎస్.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజుకు అవార్డుల పంట



కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర గ్రామానికి చెందిన కొత్తపల్లి సీతారామరాజుకు మూడు ఫిల్మ్‌ఫెస్టివల్ అవార్డులు దక్కాయి. తిరుపతిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన కార్యక్రమంలో డివోషనల్ విభాగంలో సింహాద్రి అప్పన్న షార్ట్‌ఫిల్మ్‌కు, బెస్ట్ యానిమేషన్ విభాగానికి, బెస్ట్ కాష్ట్యూమ్ డిజైనింగ్‌కు మూడు అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా సీతారామరాజుకు సినీ, టీవీ, రంగస్థల కళాకారులు అభినందనలు తెలిపారు.

బెస్ట్ డైరెక్టర్‌గా విజయమిత్ర



అవార్డుతో విజయ మిత్ర

సారవకోట: మండల కేంద్రం సారవకోటకు చెందిన జోష్యుల చిట్టిబాబు కుమారుడు విజయమిత్రకు బెస్ట్ డైరెక్టర్ అవార్డు లభించింది. తాను దర్శకత్వం వహించిన 100 డేస్ లవ్ స్టోరీ సినిమాకు గాను ఈ నెల 4న తిరుపతిలో జరిగిన ఇంటర్నేషన్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ డైరెక్టర్ అవార్డును విజయమిత్ర అందుకున్నారు. శివ ప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై పీవీ రమణమూర్తి నిర్మించిన ఈ సినిమా మంచి విజయం సాధించిందన్నారు. తాను పదేళ్లుగా సినీ పరిశ్రమలో రచయిత, కో డైరెక్టర్, డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. ముహూర్తం, నీకై వేచి ఉన్నా, 100 డేస్ లవ్‌స్టోరీ సినిమాలకు డైరెక్టర్‌గా పని చేసినట్లు తెలిపారు. త్వరలో రాలుగాయి సినిమా చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు.

నెలాఖరులోగా స్త్రీనిధి రికవరీ చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

శ్రీకాకుళం రూరల్ : అన్ని గ్రామ సంఘాల్లో ఈ నెలాఖరులోగా స్త్రీనిధి రికవరీ వసూలు చేయాలని డీఆర్‌డీఏ పీడీ డి.వి.విద్యాసాగర్ ఆదేశించారు. శ్రీకాకుళంఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గార, శ్రీకాకుళం, నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల ఏపీఎం, సీసీఎస్, అకౌంటెంట్లు, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా గ్రామ సంఘాలకు జీవనోపాధి పెంపొందించుకునేందుకు లక్ష్యాలను కూడా పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామసంఘాలు, మండల సంఘాల గ్రేడింగ్‌లపై సమీక్షించారు. జగనన్న తోడు రుణాల తొమ్మిదో విడత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం, ఐబీడీపీఎం, మేనేజర్లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

శుభ ఘడియలు వచ్చేశాయ్!

- ఈ నెల 13 నుంచి వివాహ ముహూర్తాలు
- కల్యాణ మండపాలకు గిరాకీ
- ఊపందుకున్న అనుబంధ వ్యాపారాలు

శ్రీకాకుళం కల్చరల్ :

మనిషి జీవితంలో వచ్చే అపురూప ఘట్టాల్లో పెళ్లి ప్రధానమైనది. వివాహ ప్రక్రియలో శుభ ఘడియలదే కీలక పాత్ర. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభమవుతుండటంతో జ్యోతిషాలయాల వద్ద రద్దీ బాగా పెరిగింది. పెళ్లి ప్రక్రియ నిర్వహించే పురోహితులకు డిమాండ్ ఎక్కువైంది. కొంతమంది తమ స్వగృహం వద్ద వివాహాలు నిశ్చయించగా.. మరికొందరు ముఖ్యంగా పట్టణాల్లో నివాసముండే వారు కల్యాణ మండపాలు బుక్ చేసుకుంటున్నారు. పెళ్లి అనుబంధ వ్యాపారాలైన భాజా భజంత్రీలు, ఫ్లవర్ డెకరేషన్స్, కర్పూర దండల షాపులు, లైటింగ్, మైకోసెట్, బంగారం, వస్త్ర దుకాణాల వద్ద హడావిడి పెరిగింది.

మంచి ముహూర్తాలు ఇవే..

ఫాల్గుణ మాసం, వైశాఖ మాసాలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అంటే ఫిబ్రవరి 13 నుంచి ఏప్రిల్ 26 వరకు శుభ ఘడియలు ఎక్కువగా ఉన్నాయని దైవజ్ఞులు చెబుతున్నారు. మళ్లీ శ్రావణ మాసం వరకు ముహూర్తాలు లేవు. ఫిబ్రవరిలో 13, 14, 24, 25, 29, మార్చిలో 2, 17, 22, 24, 27, 28, 30, ఏప్రిల్‌లో 3, 4 తేదీలలో మంచి ముహూర్తాలని పండితుల మాట.

మే నుంచి మూఢం.. జూలైలో ఆషాఢం

ఈ ఏడాది మే 1 నుంచి జూన్ 7 వరకు శుక్రమూఢం ఉంది. మే 5 నుంచి జూన్ 1 వరకు గురుమూఢం ఉంది. ఈ సమయంలో ఎటువంటి శుభకార్యాలు చేయకూడదని పండితులు చెబుతున్నారు. తరువాత ఆగస్టు 4 వరకు ఆషాఢ మాసం ఉంటుంది. అప్పుడు శుభకార్యాలు ఉండవు. అక్కడి నుంచి శ్రావణ మాసంలో వివాహాలకు అవకాశం ఉంది.

జోరుగా ఏర్పాట్లు..

ఈ రోజుల్లో పెళ్లి నిర్వహించాలంటే మండపాలు తప్పనిసరిగా మారాయి. ఎవరి స్థాయికి తగ్గట్టుగా వారు మండపాలు రిజర్వు చేసుకుంటున్నారు. ఇళ్ల వద్ద చేసుకునేందు స్థలాభావం వల్ల కల్యాణ మండపాలు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు నిర్వాహకులు రోజుకు రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. బ్యాండు మేళాలు రూ.30వేల నుంచి రూ. 80వేల వరకు ఖర్చుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇక భోజనాలు, ఫొటోగ్రఫీ స్థాయికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



పూల అలంకరణలో పెళ్లి మండపం

వస్త్రాలు, ఆభరణాల షాపులు కళకళ..

మూడునెలల తరువాత జరిగే వివాహ ముహూర్తాలు రావడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. వధూవరులకు కావలసిన వస్త్రాలు, పట్టుచీరల కొనుగోళ్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. పెళ్లిలో బంగారానిది ముఖ్యపాత్రే. తాళిబొట్టు, మట్టెలతో పాటు ఇతర ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారితో జ్యూయలరీ షాపులు కళకళలాడుతున్నాయి.

మొదలయ్యాయి..



పెళ్లి ముహూర్తాలే మాకు ఆదాయం. ఈ ఏడాది ముహూర్తాలు మొదలు కావడంతో పెళ్లి చేయించేందుకు కుటుంబ పెద్దలు మా వద్దకు వస్తున్నారు. తేదీలు ముందుగా బుక్ చేసుకుంటున్నారు.

– వేదుల విజయభాస్కరరావు, పురోహితులు

మంచి ముహూర్తాలు



ఫాల్గుణం, చైత్రమాసాలలో మంచి ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. మే 1 నుంచి మూఢాలు ప్రారంభమవుతున్నాయి. జూలైలో ఆషాఢం కాబట్టి ముహూర్తాలు ఉండవు. మళ్లీ శ్రావణ మాసంలోనే ముహూర్తాలు ప్రారంభమవుతాయి.

– దైవజ్ఞ తెన్నేటి విక్రమశర్మ, పంచాంగకర్త

ఆత్మీయ ఆలింగనం



కవిటిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను ఓ వృద్ధురాలు ఆత్మీయ ఆలింగనం చేసుకుని పలకరించింది. ఇద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. అనంతరం అదేమార్గంలో ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారి సంబరం ఊరేగింపుగా వెళ్తుండగా.. భక్తుల కోరిక మేరకు చైర్‌పర్సన్ పిరియా విజయ అమ్మవారిని తలపై పట్టుకొని ముందుకు నడిచారు.

- కవిటి

నలుగురు ఒడిశా గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 20 కిలోల గంజాయి, కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం
- పరారీలో మరో గంజాయి స్మగ్లర్



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన నలుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి కారు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో మండలంలో జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బుంగాపుట్టు నుంచి వస్తున్న కారు(ఓడీ 08జే 1818) పోలీసులను చూసి నిలుపుదల చేసి ఐదుగురు పరారయ్యారు. దాంతో వారిని వెంబడించి ఎంతో చాకచక్యంగా నలుగురిని పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి లభించింది. గంజాయిని, కారును సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని నిర్ధారించారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన సిబా హంతల్, భీష్మ హంతల్, ఎలంపక గ్రామానికి చెందిన రమేష్ ఖిలా, కడగుమ్మా గ్రామానికి చెందిన మానస్ ఖిలాలుగా గుర్తించారు. కోరాపుట్టు జిల్లా కేంద్రానికి చెందిన మరో గంజాయి స్మగ్లర్ పరారీలో ఉన్నాడని, అతనిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఏఎస్‌ఐ తిరుపతి, పోలీసులు, హోం గార్డులు నాగేశ్వరరావు, అర్జున్ పాల్గొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి అనూరాధ

నరసన్నపేట: ప్రభుత్వ వసతి గృహాల్లో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఈ.అనూరాధ అన్నారు. నరసన్నపేటలోని దేశవానిపేట బాలికల బీసీ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో మెలకువలు చెప్పిస్తున్నామన్నారు. మేట్రిన్లు కూడా బాధ్యతగా వ్యవహరించి శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ త్రినాథరావు, మేట్రిన్లు, వార్డెన్లు పి.పద్మావతి, దేవి, శ్రీలక్ష్మి, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు బి.కేశవరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కొత్తూరు విద్యార్థుల ప్రతిభ



విజేతలకు పతకాలు అందజేస్తున్న సినీ నటుడు సుమన్

కొత్తూరు: విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4, 5 తేదీల్లో యునైటెడ్ షోటోకన్ కరాటే డు ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అండర్-13 విభాగంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కొత్తూరు బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు సత్తాచాటారు. 6 బంగారు, 3 వెండి, 4 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. వీరంతా సినీనటుడు సుమన్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విజేతలతో కలిసి స్కూల్ నిర్వాహకులు కొత్తూరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్‌ఐ ఎంఏ అహమ్మద్‌లు క్రీడాకారులను అభినందించారు.

పోలీస్‌స్టేషన్ ముందే టీచర్ల వాగ్వాదం

టెక్కలి రూరల్ : టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం సాయంత్రం ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య కొట్లాట కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమదాలవలసకు చెందిన తమ్మినేని శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలకు వెళ్లి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డారు. ఇదే పాఠశాలలో పనిచేస్తున్న సహోపాధ్యాయుడు జి.శివానంద్ అండవల్లే తనపై దాడి జరిగిందంటూ శ్రీనివాస్ టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో టెక్కలి పోలీసులు శివానంద్‌ను విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించారు. శివానంద పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసేలోపే శ్రీనివాస్, కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకున్న శివానంద స్టేషన్‌లోకి పరుగులు పెట్టారు. అక్కడ కూడా ఇద్దరూ బాహాబాహీకి దిగారు. దీంతో సిబ్బంది ఇద్దరినీ వేర్వేరు గదుల్లో ఉంచారు. విషయం తెలుసుకున్న టెక్కలి రూరల్ సీఐ సూర్య చంద్రమౌళీ స్టేషన్‌కు చేరుకుని సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇరువర్గాలపై కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ లక్ష్మిని ఆదేశించారు. కాగా, హెచ్‌ఎం శ్రీనివాస్ నిత్యం పాఠశాలకు ఆలస్యంగా వస్తుంటారని రెండు రోజుల కిందే గ్రామస్తులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ సైతం జరిగింది. ఈ క్రమంలోనే ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మహారాణిపేట (విశాఖపట్నం): బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గొండు సీతారాం సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీస్, వైద్య ఆరోగ్య తదితర శాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో 'బాలల హక్కులు, పరిరక్షణ'పై ప్రాంతీయ స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాల కార్మిక కేసులు, ప్రభుత్వం అందిస్తున్న నిధులు, చేపట్టిన చర్యలు, లబ్ధిపొందిన వారి వివరాలపై ఈ సందర్భంగా చైర్మన్ ఆరా తీశారు. చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్,రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రాంతీయ స్థాయి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు క్రైం డీసీపీ వెంకటరత్నం, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో-ఆర్డినేటర్ జి. తిరుపతిరావు, విశాఖ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్లు, ఆరు జిల్లాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అభినందనలు



చక్రపాణిని అభినందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఎంఎల్ఐఎస్సీ (లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దువ్వు చక్రపాణి అహ్మదాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ద్వారా ఆదర్శ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కార్ నేషనల్ ఎక్సెలెన్సీ అవార్డు -2024కు ఎంపికయ్యారు. పరిశోధన, బోధన రంగంలో కృషికి గాను ఈయన్ను ఎంపిక చేసింది. షీల్డ్, ధ్రువీకరణ పత్రం వర్సిటీకి పంపించగా, మంగళవారం అందుకున్నారు. అనంతరం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని తన చాంబర్‌లో చక్రపాణినిని అభిందించారు. పరిశోధనలకు బోధన సిబ్బంది ప్రాధాన్యమివ్వాలన్నారు.

కరస్రాము పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులతో కర్రసాము సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి సౌత్ జోన్ కర్రసాము పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. నెల్లూరు వేదికగా ఈ నెల 4న జరిగిన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. రుప్ప నరేంద్ర నాయుడు, బగ్గు హర్షవర్ధన్‌లు ఒంటి కర్రసాము, రెండు కర్రల సాము, ఒంటి కర్ర యుద్ధం విభాగాల్లో నాలుగు బంగారు, ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా కర్రసాము అసోసియేషన్ కార్యదర్శి కె.తారకరామ, కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీహరి, జి.శ్రీనివాసరావు, రాష్ట్ర కర్రసాము అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.భాస్కరరావు, జిల్లా డిస్ట్రిక్ట్ ఉషూ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి శివకుమార్ మంగళవారం అభినందించారు.

వివాహిత ఆత్మహత్య..?

కొత్తూరు: మండలంలోని బలద గ్రామానికి చెందిన జద్దు ఉషారాణి (30) మంగళవారం ఒడిశా రాష్ట్రం మిలగాంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమెకు భర్త రామారావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం బ్యాంకు పని కోసమని చెప్పి ఆమె ఇంటి నుంచి బయల్దేరి వెళ్లారు. తీరా చూస్తే ఒడిశా రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్నారని తెలిసింది. అయితే ఆమె మృతిపై స్థానికంగా అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. హత్య జరిగి ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



అలంకరణలో ఉత్సవ మూర్తులు



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పుష్యమాసం మంగళవారం బహుళ ఏకాదశి సందర్భంగా మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతి పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

టూరిజం పోటీలకు సిద్ధంకండి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి

శ్రీకాకుళం రూరల్: టూరిజం పోటీలకు విద్యార్థులు సిద్ధం కావాలని నైరా అగ్రికల్చర్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 14లోగా ఎంట్రీలను ఆన్‌లైన్‌లో పంపించాలని కోరారు. మంగళవారం నైరా కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ 'టూరిజం ఫర్ టుమారో' అనే అంశంపై కేస్ స్టడీ కాంపిటేషన్ తయారు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలరు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఎన్‌జీవోలు, స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అర్హులరని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై విజిలెన్స్ విచారణ

టెక్కలి: టెక్కలి, సంతబొమ్మాళి మండల విద్యుత్ శాఖ ఏఈలు ఈశ్వరరావు, శివకుమార్‌లపై పలువురు ప్రజాప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులు, గడప గడపకూ మన ప్రభుత్వంలో వచ్చిన విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విజిలెన్స్ సీఐ వెంకట్‌నారాయణ, ఎస్‌ఐ సురేష్‌బాబు తమ బృందంతో కలిసి విచారణ చేపట్టారు.

మార్కెట్‌లోకి 'రెనాల్ట్ 24'



నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్లు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల హంగులతో మార్కెట్‌లోకి సరికొత్త రెనాల్ట్ 24 వాహనాన్ని తీసుకురావడం అభినందనీయమని ఎస్‌బీఐ రామలక్ష్మణ బ్రాంచి చీఫ్ మేనేజర్ పి.సుందర్‌శ్రీకాంత్, డిప్యూటీ మేనేజర్ పాండురంగారావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేట వద్ద షోరూంలో కస్టమర్ల సమక్షంలో మంగళవారం రెనాల్ట్ 24 వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అవసరాలకు అనుగుణంగా వాహనాలను కొనుగోలు చేస్తున్నారని, ఆ దిశగా రెనాల్ట్ వాహనాలు తయారు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హర్ష రెనాల్ట్ సేల్స్‌మేనేజర్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు: చల్లవానిపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పలాసకు చెందిన డి.వీర్రాజు, శ్రీనివాస్ పెళ్లి కార్డులు పంచేందుకు చల్లవానిపేట నుంచి బుడితి ద్విచక్రవాహనంపై వస్తుండగా మరో వాహనచోదకుడు శ్రీరాములు అడుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీర్రాజు తలకు బలమైన గాయం కావడంతో 108 సిబ్బంది బాలరాజు రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై బి.లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు.

Roc.No.368/2023/A1 తేది. 05-02-2024

పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయం

బహిరంగ వేలం నోటీసు

2024-2025 సంవత్సరమునకు గాను పలాస కాశీబుగ్గ పురపాలక సంఘమునకు సంబంధించిన ఈ దిగువన తెలిపిన వేలం పాటలకు తేది 16-02-2024న ఉదయం గం॥ 11.00 లకు పురపాలక సంఘ కమీషనర్ వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయము ఆవరణలో బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును.

క్ర. సంఖ్య	గుత్త వివరములు మరియు గడువు కాలం	వేలం ధరావత్తు	సాల్వెన్సీ సర్టిఫికెట్ మొత్తం రూ.	[illegible]
1.	తే.01-04-2024ది నుండి తే.31-03-2025 వరకు పురపాలక సంఘ పరిధిలో గల రోజువారీ మార్కెట్ మరియు బస్టాండ్, కార్లుస్టాండ్‌లో ఆశీలు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు మరియు పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో గల పేటలలో అమ్ముచూచే వస్తువులపై ఫీజులు వసూలు చేసుకొనుటకు	2,00,000/-	20,00,000/-	
2.	తే.01-04-2024ది నుండి తే.31-03-2025 వరకు జంతువధశాల (కబేళా) లో నిర్ణీత ఫీజు వసూలు చేసుకొనే హక్కు	1000/-	50,000/-	
3.	పాత వార్తాపత్రికలు అమ్మకం(2021-22 & 2022-23 సంవత్సరములకు సంబంధించినవి)	200/-		
1.	IDSMT షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులను గుడ్‌విల్ పద్ధతిపై లీజుకిచ్చుటకు షాపు నెం. 1.SC కేటగిరి: 39, 41. 2.ST కేటగిరి:35. 3.జనరల్ కేటగిరి:37,38,40	20,000/-	30,000/-	
2	సీతమ్మ తల్లి షాపింగ్ కాంప్లెక్స్, పలాస షాపు నెం. 1.SC కేటగిరి: 01. 2.జనరల్ కేటగిరి: 4,9,10,12,13,15	5000/-	10,000/-	
3.	మహాత్మాగాంధీ పురపాలక షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం. 1.జనరల్ కేటగిరి: 31,32,34, 35,45,46,48,51,53,54,55,57,58,60 2.SC కేటగిరి: 56,59.	5000/-	10,000/-	

షరతులు: 1. దినవారి మార్కెట్ ఆశీలు వసూలు కొరకు పాటలు పాడదలచుకున్న దరఖాస్తు దారులు మీ యొక్క దరఖాస్తుతో పాటుగా రూ. 100/- విలువ గల నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపరు మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్ తేది. 13-02-2024 సా॥ గం. 5-00ల లోగా దాఖలు చేయవలెను. 2. తే.05-02-2024 ది తరువాత తీసిన ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికేట్స్ మాత్రమే చెల్లుబాటు అగును. 3. మార్కెట్ కీపింగ్ సంబంధించి సాల్వెన్సీ యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్‌తో సహా బహిరంగ వేలంనకు హాజరు కావలెను. 4. ఇంకా వివరములకు కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.

సం/- కమీషనరు, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం